77316



# విజయలక్ష్మి

బి.యస్. లక్ష్మి

ఉలికిపడి లేచింది విజయ.

చుట్టూ గాఢాంధకారం. శరీరమంతా గజ గజా వణికిపోతోంది. యింతవరకు జరిగింది యదార్థం కాదనీ, ఉట్టి కలేననీ తెల్సుకునేందుకు కొన్ని క్షణాలు పట్టిందామెకి.

కెప్టెన్‌గా వెళ్లిన తన భర్త ప్రభాకర్, శరీరమంతా గుళ్ల దెబ్బలుతిని నిర్జీవంగా పడిపోయుంటే, అతన్ని త్రొక్కేస్తూ శత్రువులు ముందుకి పరుగెడుతున్నారు......

అబ్బ! ఎంత భయంకరమైన కల! యిది కలేనా! 'కల' అని తెల్సినా కూడా నిజమేమోనన్న భ్రమతో ఆమె ప్రాణం విలవిల్లాడిపోయింది. ఎంత వద్దనుకున్నా మనస్సెందుకో కీడునే శంకిస్తోంది.

తల్చుకుని, తల్చుకుని బావురుమంది విజయ. కలలో దృశ్యం ఆమెని పిచ్చిదాన్నిలా చేసింది. గుండె బరువెక్కింది. ఏవేవో పిచ్చి పిచ్చి ఆలోచనలతో పక్కమీద అటూ యిటూ పొర్లింది.

యీ పాడు ఆలోచన్నని వదిలించుకుని, ఏవైనా మంచి ఆలోచనల్నీ, మధుర స్మృతులూ తెచ్చుకోడానికి ప్రయత్నించింది. ఎంతచేసినా చుట్టూ తిరిగి మనస్సు మొదటి స్థానానికే వచ్చి చేర్తోంది.

పెళ్లయిన యీ పది నెలల్నుంచీ ప్రభాకర్‌తో తన సహచర్యం, అనేక తియ్యని సంఘటనల్నీ జ్ఞాపకం తెచ్చుకోసాగింది.

"విజ్జీ! ఈ సెలవుల్లో మనం ఎక్కడికీ పోవద్దు. 'హనీమూన్' అంటే మన యిండియన్సుకి అవస్థలు తప్పించి మరే ఎంజాయ్‌మెంటూ ఉండదు. యీ నెల్లాళ్లూ యిక్కడే గడిపి, నన్ను నువ్వూ, నిన్ను నేనూ బాగా తెల్సుకుందాం. వచ్చే సంవత్సరం యీ రోజులకి మనం కాశ్మీర్ పోదాం. ఏం?"

"పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పటినుంచీ నా భార్యని గురించి ఏవేమో వూహించుకునేవాడ్ని. సంస్కారం, అలవాట్లూ ఆప్యాయతా, అనురాగం అన్నీ అచ్చంగా నువ్వున్నట్లే వూహించుకున్నాను. కాని రూపం మాత్రం ఎంత ప్రయత్నించినా కళ్లముందు నిల్చుకోలేకపోయేవాడ్ని.....

"నిన్ను చూసేకమాత్రం 'కరెక్ట్' యిదే రూపం......అనుకున్నాన్లే!

"అయినా నువ్వు గొప్ప మంత్రకత్తెవి సుమా విజయా! కన్పించకుండా నా కలల్లోకివచ్చి, యిన్నాళ్లూ నన్నెంత అల్లరి పెట్టేవ్!

"నన్నుట్టి పసిపాపని చేస్తున్నావ్ విజ్జీ! నాకేమీ మిగల్చకుండా, నువ్వే చూసుకుని చేసేస్తుంటే కొన్నాళ్ళకి షర్టు గుండీలు పెట్టుకునేందుక్కూడా వోపికలేని సోమరినైపోతాను తెల్సా

"యిన్నాళ్లూ నువ్వెవరివో నాకు తెలియదు. కాని యిప్పుడు.....నువ్వు లేకుండా ఒక్క క్షణమైనా నే నుండగలనా అన్పిస్తోంది విజ్జీ!"

ఇవి పెళ్లయిన దగ్గర్నుంచీ ఎన్నో సందర్భాల్లో ప్రభాకర్ నోటంట విన్పించిన మధుర వాక్కులు, తియ్యని లేఖినితో అందంగా, ఏనాటికీ చెరిగిపోనివిధంగా తన హృదయ ఫలకంమీద లిఖించబడ్డాయి.

ఇంకా ఎన్నో యిలాంటి మధుర సంఘటనలు మళ్లీ మళ్లీ తల్చుకుని మురిసిపోతున్న విజయ ముఖం మందహాసంతో వెలిగిపోయింది. కొన్ని క్షణాలు. అంతే!

అంతలోనే.....

ఈదురుగాలి తాకి అల్లాల్లాడిపోయిన జ్యోతిలా మందహాసం చెదిరిపోయి ముఖాన చీకట్లని పులిమింది. యీసారి ఆమె మనస్సునంతా ఏవేవో దుస్సంఘటనలు ఆక్రమించుకున్నాయి.

ఆ గడ్డురోజు.....

ఉద్యోగం బాధ్యతమీద అతనటూ, తను పుట్టింటికీ ప్రయాణమయ్యేరోజు!

ఏదో చెప్పలేని బాధతో గొంతుక పూడిపోయింది. ఏమైనా మాట్లాడాలన్నా ముందుగా ఏడుపు తప్పించి మరేమీ రావడంలేదు. సర్వశక్తులూ సన్నగిల్లిపోయినట్లు తను ఏ పనీ చెయ్యలేకపోయింది. మంచంమీద కూర్చుని అలా శూన్యంలోకి

చూస్తూండిపోయింది. ప్రభూ మాత్రం నిర్వికారంగా తమిద్దరి ప్రయాణపు ఏర్పాట్లు చేస్తూండిపోయారు.

ఆఖరికి ఆ క్షణం రానే వచ్చింది.....

ఆపుకోలేని దుఃఖంతో అతని హృదయం మీద వాలిపోయి ఏడ్చేసింది. పసిపాపలా ఏడుస్తున్న తనని అలాగే చుట్టేసి, తలని నిమురుస్తూ, చాలాసేపువరకూ ఏమీ మాట్లాడలేదు. యీ వియోగం అతన్నీ బాధిస్తూనే ఉంది.

ఏవేవో వోదార్పు మాటలు అతను చెప్తూంటే, కొంచెం కొంచెంగా ధైర్యాన్ని తనలో నింపుకుంది.

“చూడు విజయా! ‘మా వారు మిలటరీ ఆఫీసరు’ అంటూ గొప్పగా చెప్పుకుని మురిసిపోగానే సరికాదు. ఆ మిలటరీ ఆఫీసరు భార్యగా, అవుసరం వచ్చినపుడు తగినంత మనో నిబ్బరం, త్యాగం సహనం అలవర్చుకోవాలి.

“మా మస్తిష్కాలు గొప్పవనీ, మా శరీరాల్లో ప్రత్యేకమైన బలం ఉందనీ యీ దేశాన్నీ, ప్రజల్నీ ప్రమాదాల్నుంచి మేం రక్షించగలమనీ, రక్షిస్తామనీ ప్రమాణాలు చేసి మాపేరు నమోదు చేస్కున్నాం. అందుకే బాధ్యతల బరువు ప్రతిక్షణం మమ్మల్ని వెన్నంటి తిరుగుతూనే ఉంటుంది. ఏ క్షణంలోనైనా ఆ బాధ్యతని నెత్తికెత్తుకుని అంధకారంలాంటి, ప్రమాదాల్లోకి పరుగు తీయాల్సొంటుంది మేము!

“యిలాంటి బాధ్యతలుగల వ్యక్తులుగా మాకు లభిస్తున్న గౌరవ మర్యాదలు, పేరు ప్రతిష్ఠలతోపాటు మే మెదుర్కొనే ప్రమాదాలకి కూడా మా భార్యలుగా మీరు సంసిద్ధులు కావాలి విజయా!

“మనిషికి మాట బలం చాలా గొప్పది విజయా! అది మనిషిలో లేని ఉత్సాహాన్నీ, శక్తినీ నింపుతుంది. మే మొక మహత్తర కార్యాన్ని సాధించబోతున్నాం. దానికి, మా జీవిత భాగస్వాములుగా మీరూ, అభిమానులుగా ప్రజలూ ఎంత ప్రోత్సాహాన్నిస్తే అంత ఉత్సాహంతో రంగంలోకి దూకుతాం. మీరు చేసే హెచ్చరికల్తో మాలో పట్టుదలని పెంచుకుని కార్యాన్ని సాధిస్తాము.

“వింటున్నావా విజ్జీ!అంచేత నువ్వు సామాన్యురాలివి కాదు.నా సర్వ శక్తీనీవు తెల్సిందా.”

ఇలాగ అతని మాటలు వింటూంటే తనలోని దిగులంతా మాయమైపోయింది.

అవన్నీ తల్చుకుంటూంటే, యీక్షణంలో కూడా తన ప్రభూ తన ఎదుట నిల్చుని అలాగే మాట్లాడుతున్నట్టుంది.

ఇవన్నీ తల్చుకుంటే విజయ మనస్సెంతో తెరిపిన పడ్డట్టయింది. అన్నీ మర్చిపోయి నిద్ర పోవడానికి ప్రయత్నిద్దామని దిండులో ముఖాన్నదిమి పెట్టింది.

కాని, ఆ కల!......

మళ్ళీ ఆ భయంకర దృశ్యం కళ్ళెదుట ప్రత్యక్షమైంది.

ఒకవేళ అదే నిజమైతే!.....ఓహ్ !..... అలాక్కాదు. అదెన్నటికీ నిజం కాదు.... చటుక్కున లేచి కూర్చుంది విజయ.

తన జీవిత కాలంలో యిరవై అయిదు సంవత్సరాలు నిరీక్షించగా కల్సుకోగల్గిందతన్ని!.....యింకా సంవత్సరంకూడా కాలేదు. తనింతవరకూ తెల్సిగాని, తెలియకగాని ఎవ్వరికీ ఏవిధమైన అన్యాయమూ చెయ్యలేదు. మరి!...తనకిమాత్రం ఎందుకన్యాయం జరుగుతుంది!....

అదేంకాదు!....తన ప్రభు క్షేమంగా ఉన్నాడు......క్షేమంగా ఉంటాడు. గబగబా వెళ్ళి లైటు స్విచ్ వేసింది. చిన్నప్పటినుంచీ తను భక్తితో సేవించుకునే దుర్గాదేవి పటం దగ్గర కెళ్ళి నిల్చుంది.

మళ్ళీ అక్కడ కూడా ఏవేవో జ్ఞాపకాలు!......

పెళ్ళయిన క్రొత్తలో తనది ‘మూఢభక్తి’ంటూ హేళన చేసేవారు. తర్వాత కొద్ది రోజులకే తన అచంచలమైన నమ్మకాన్ని చూసి మరెన్నడూ పరిహాసంగానైనా మాట్లాడలేదు. భక్తిమార్గంలో ఏవిధంగాగానూ తనకి అడ్డుపడలేదు. అవును...... తనని సంపూర్ణంగా అర్థం చేస్కున్న సహచరుడు, తన విలువని గ్రహించి వేయి కళ్ళతో కాపాడుకునే రక్షకుడు, తన ప్రభాకర్!......

ఏవిధంగానూ తనని దురదృష్టవంతురాల్నిగా చేయొద్దని ప్రార్థించింది దుర్గాదేవిని.

అచైతన్యంగా వచ్చి సోఫాలో కూర్చుంది.

మంచీ చెడూ అనేక సంఘటనల జ్ఞాపకాలు ఈగల్లా ముసురుకున్నాయి విజయని.

మనస్సు నెంత మళ్ళించినా, ఎన్ని ప్రయత్నాలు చేసినా మాటి మాటికీ ఆ పీడ కల...... ఆ భయంకర సంఘటనలే కళ్ళ ముందు కొచ్చి శరీరాన్ని నిలువునా కంపించి పోయేలా చేస్తోంది. ఎంత వద్దనుకున్నా మనస్సు దుశ్శంకలనే నింపుకుంటోంది.

చటుక్కున, చిన్ననాటి సంఘటనొకటి మెరుపులా మెరిసింది విజయ స్మృతిపథంలో.

అప్పటికి పన్నెండు సంవత్సరాల వయస్సుంటుంది. అమ్మ తప్పించి ప్రపంచంలో ప్రియమైన దేదీ లేదప్పటో, ఒకరోజు.... రాత్రి నిద్రలో యిలాంటిదే పీడ కల!..... అమ్మ చచ్చిపోయినట్టుగా కలొచ్చింది. కెవ్వున కేకవేసి లేచి కూర్చుంది. అమ్మ, నాన్న, మామ్మ అంతా ఏమైందోనని గాభరాగా చుట్టూ మూగిపోయేరు.

“ఏమైనా పీడ కలొచ్చిందా అమ్మలూ! భయపడ్డావా?” అంటూ తన ప్రక్కనే కూర్చుని పైట చెంగుతో కన్నీళ్ళు తుడిచింది అమ్మని చూడగానే కొండంత సంతోషం కల్గింది తనకి.

ఏడ్పు మానేసి, “అమ్మా నువ్వు చచ్చిపోలేదూ! బతికే ఉన్నావుకదూ!” అంటూ అమ్మ వళ్ళో తల దూర్చేసి రెండుచేతుల్తో చుట్టేసుకుంది.

అమ్మ మరింత దగ్గరగా తనని లాక్కుని, మెల్లగా తలమీద జో కొడ్తూ “పిచ్చిపిల్లా! అందుకేనా అలా ఏడ్చేవు! అది ఉట్టి కలే! భయంలేదు పడుకో!” అంది. నాన్న నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

“ఒసేవ్! అమ్మలూ, అలా ఎవరైనా చచ్చిపోయినట్టు కలొస్తే, వాళ్ళకి మృత్యుగండం గడిచిపోయిందన్నమాట. పీడా పరిహారం అయింది. వాళ్ళ కింక ఏ భయమూ ఉండదు. నువ్వు హాయిగా నిద్రపో! మీ అమ్మ కేమీ ఫర్వాలేదు!” అంది మామ్మ.

నిజమే! అమ్మ కెలాంటి మృత్యుగండం గడిచిందో తనకి తెలియదుకాని, తనకిప్పటికీ అమ్మ వుంది.

మామ్మ చెప్పింది నిజం! పీడా పరిహారమయ్యింది. మృత్యు గండం గడిచింది. తన ప్రభాకర్ క్షేమంగా విజయంతో తిరిగి వస్తాడు.....తిరిగి వస్తాడు....

విజయ మనస్సంతా తేలికపడి హాయిగా వూపిరి తీసుకుంది. మనస్సు నిర్మలంగా ప్రశాంతంగావుంది. అయినా, పడుక్కుని నిద్రపోవాలనిపించలేదు.

లేచి గదిలోనే అటూ యిటూ కాసేపు తిరిగింది. ప్రభాకర్ మధ్యలో వ్రాసిన ఒకే ఒక ఉత్తరాన్ని తీసి మళ్ళీ మళ్ళీ చదువుకుంది. తర్వాత ప్రభాకర్ ఫోటోని చూస్తూ చాలాసేపు కూర్చుండిపోయింది.

కొంతసేపు ప్రస్తుత పరిస్థితుల గురించి ఆలోచించింది.

చిన్న సంగతుల దగ్గర్నుంచీ పెద్ద పెద్ద విషయాలవరకూ ప్రతిదాంట్లోనూ, అనాది నుంచీ నేటివరకూ కూడ ప్రతిక్షణం మంచి చెడులమధ్య సంఘర్షణ జరుగుతూనే వుంది.

# విజయలేఖ

చివరికి న్యాయానికే విజయం ఖాయం!

విజయలో ఏదో క్రొత్త ఉత్సాహం పుట్టుకొచ్చింది. రైటింగ్ టేబిలు దగ్గరి కెళ్లి టేబిల్ లాంప్ వెలిగించింది. లెటర్ పాడ్‌తీసి ప్రభాకర్‌కి ఉత్తరం వ్రాయడం ప్రారంభించింది.

"ఎన్నో వ్రాయాలనివుంది. కాని తీరా మొదలుపెట్టేక ఏమిరాయాలో తోచడంలేదు




ASP/ABF-43 TEL.

వ్యక్తిగతంగా ఏమైనా వ్రాసుకునే పరిస్థితుల్లో లేము. అయినా వ్యక్తులమే దేశానికి అంకితమైపోయినప్పుడు వ్యక్తిగత మనే ప్రశ్నేలేదు కదా!

అంతదూరంనించి మీ విజయవార్తలు క్షణాలమీద తెలుస్తూనే ఉన్నాయి. అవి వింటూ, దేశమంతటా నవ చైతన్యం రేకెత్తింది.

ప్రభూ! ఆరోజు అన్నారే! యీ ప్రజల్నుంచి ప్రోత్సాహం కావాలని, కాని మీ వల్లే యీ ప్రజలకి ఎంత ప్రోత్సాహం లభిస్తున్నదో తెలుసా!

మీ విజయ వార్తలు వింటూంటే జీవంలేని శరీరంలో జీవం ప్రవేశిస్తున్నది. శక్తులుడిగిపోయిన వృద్ధుల్లో నూతన శక్తులుద్భవిస్తున్నాయి. బాలలు వీరులవుతున్నారు.

అర్ధానికి, స్వార్ధానికి మారుపేరులైన మహిళలు నిస్వార్ధులూ, త్యాగమూర్తులూ అవుతున్నారు.

మన దేశ పరిస్థితుల గురించి మన ప్రజలకి తెలియని సంగతులుకాని, తెలియకూడని రహస్యాలుకాని ఏమీలేవు. దేశం కోసం చెయ్యవల్సిన విధుల గురించి ప్రత్యేకంగా నిర్బంధపు ఆంక్షలు అసలే లేవు కదా! అందుకనే ప్రతి పౌరుడికీ దేశం విలువ, ప్రత్యేకత తెల్సి వచ్చాయి. మాతృభూమిమీద మమకారం పెరిగింది.

ఎవరూ కోరనవసరం లేకుండానే ఎవరి మట్టుకు వారే మన దేశంకోసం ఏదో విధంగా ఉపయోగ పడాలనే తాపత్రయం కల్గుతోంది.

శక్తినిమించిన ఉత్సాహంతో మీవంటి కార్యశూరులకి కావల్సినంత ప్రోత్సాహం యివ్వడానికి అన్ని వేళలా సంసిద్ధంగా ఉన్నారు.

అందరూ మీలాగనే ఆరంగంలో నిలబడలేకపోవచ్చు! కాని అవసరమైతే దేనికీ వెనకాడబోమనే పట్టుదలని ప్రదర్శిస్తున్నారు.

ఇటు దేశంలో మూల మూలల్నుంచీ పొంగుకుతున్న చైతన్యోద్రేకాన్ని, అటుమీ నుండి విన్పిస్తున్న విజయ పరంపరలనీ వింటూంటే.....ప్రభూ!..... ఓహ్! ఏం చెప్పేది! నాలో ఉద్రేకం నర నరాల్లోనికి ప్రాకుతుంది. ఆవేశం నన్ను క్షణంసేపు కూర్చో నివ్వదు.

నేను కూడా ఏదో చెయ్యాలనీ....నా జీవితాని క్కూడా సార్ధకత కలగాలనీ వెర్రి ఆవేశం పొంగుకొస్తుంది. కాని....కాని. నేనేం చేయగలను? ఆడదాన్ని, అబలని...... ఏం చేయగలను నా ప్రతీ కదలికలోనూ అబలత్వపు ముద్ర పడుతుంది. అసలు నన్ను పెంచిన విధానంలోనే అబలత్వాని పోసి పెంచేరు. అబలత్వపు కిరీటాన్ని అందంగా నా శిరస్సు నలంకరించేరు. సున్నితంగా, సుకుమారంగా పెంచి, యీ చేతులకి అబలత్వపు కంకణాల సంకెళ్ళు తొడిగేరు.

నా శరీరంలో బలంలేదు.....నా బుద్ధిలో బలానికి ప్రయోజనంలేదు. వేరే ఏవిధమైన అర్హతలూ నాలో లేవు.....నేనేం చెయ్యగలను చెప్పండి!

నేనేవిధంగానూ దేశానికి ఉపయోగ పడలేననీ, అప్రయోజకురాల్ననీ తల్చుకుంటేనే ఏడుపొస్తోంది.

ఏ దేవతైనా కరుణించి నాలో అద్భుత శక్తుల్నినింపుతే.....క్షణాలమీదమిమ్మల్నిచేరుకుని మీతోపాటు సహకరించగల్గేదాన్ని కదా!

నా ఆలోచనలన్నీ పిచ్చిగా అన్పిస్తున్నాయా మీకు? నేనేకాదు, ఈ పరిస్థితుల్లో ప్రతి స్త్రీ యిలాగే ఆలోచిస్తూంటుందని నా అభిప్రాయం.

అయినా ప్రభాకర్, మళ్లీ అనుకుంటుంటాను. నే నెందుకు అప్రయోజకురాల్నవుతాను? నా సర్వస్వం అయిన మీరక్కడ ఉన్నారు. అది సామాన్య విషయమా!

నాలో సర్వ శక్తులూ మీలోనే ఉంచేను. నాలోని ఆనందం ఉత్సాహం అంతా మీలోనే నింపేసాను. నా చుట్టూ వెలుగుని కూడా మీ వెంటే పంపేసాను.

నా సర్వస్వం మీతోనే పంపేసి కేవలం ప్రాణాలుమాత్రం యీ శరీరంలో ఉంచుకున్నాను. యిది సామాన్య విషయం కాదే!

ఇంతకంటే సాహసం, యింతకంటే గొప్పదైన త్యాగం మా స్త్రీలకి మరొకటేదైనా వుందా?

మీ వీరత్వమంతా మా మనోనిబ్బరాల్లోంచి మలిచినదే! మీలోని ప్రజ్ఞంతా మా సృష్టిలోని ప్రతిభే!

వెళ్లండి ప్రభాకర్! ధైర్యంతో వెళ్లి మీ కర్తవ్యాన్ని దిగ్విజయంగా నెరవేర్చండి!

మీరంతా అక్కడ ప్రమాదాల మధ్య యిరుక్కుని వంటరిగాలేరనీ అశేష ప్రజాశక్తి మీ అండనే నిల్చునివుందనీ, మీకు శుభాకాంక్షలు చేస్తోందనీ, మా సానుభూతి ఎప్పుడూ మీ చుట్టూ తిరుగుతూనే వుందనీ, మీతోటి వీరులందరికీ కూడా చెప్పి హెచ్చరించండి ప్రభూ!

మీ తల్లులూ, అక్కచెల్లెళ్లూ, భార్యలూ, కుమార్తెలూ అంతా కూడా, మీలోని మానవ శక్తిని ద్విగుణీకృతం చెయ్యమని, మానవాతీతమైన శక్తిని అహర్నిశలూ అనేక విధాల ప్రార్థిస్తున్నారని వాళ్లందరితోనూ చెప్పండి!

చక్కని సౌకర్యాలతో, అందమైన భవన నిర్మాణాన్ని ప్రారంభించేం మనం. మధ్యలో పెనుతుపాను ప్రారంభమయింది. దాన్నుంచి రక్షించుకోవడం మన ప్రథమ కర్తవ్యం.

మన దేశ చరిత్రలో యిది ఎన్నటికీ చెరిగి పోకుండా చిరస్థాయిగా నిల్చిపోయే అధ్యాయం! దీని కార్యసాధకులు మీరంతా!

ఈనాడు ప్రజా దృష్టంతా ఆత్రంగా మీ చుట్టూనే తిరుగుతోంది. ఆ బాల గోపాలం ప్రతి వారి నోటంటా విన్పిస్తున్న కథలన్నీ మీ గురించే.

ఇంకా ఏం వ్రాయాలి ప్రభూ!

మాటల్లో పెట్టలేని మనోభావా లెన్నో ఉన్నాయి. వ్రాసే విధానం ఏమాత్రం తెలియదు.

ఈ విజయ ఎప్పుడూ మీదే! కాని... నా కోసం మాత్రం మీ విజయాన్ని త్వరగా తీసుకురండి!

జైహింద్!''

ఉత్తరాన్ని ముగించిలేచింది విజయ.

రాస్తున్నంతసేపూ అనేక భావావేశాల్తో కళ్లంట అశ్రువులు ప్రవహిస్తూనే ఉన్నాయామెకి.

స్విచ్ దగ్గరికెళ్లి లైటు ఆర్పేయబోయి మానేసింది. యిక తను చీకటిని చూడదల్చుకోలేదు.....చూడదు....

'తెలవారేక ఆ ప్రభాకరుడే తన దివ్య కాంతిలో యీ అల్ప కాంతిని విలీనం చేసుకుంటాడు' అనుకుంది.

మెల్లగావచ్చి పరుపుపై వాలింది విజయ. ఆట్టే ఆలోచనలకి అవకాశం లేకుండానే, అలసిపోయిన ఆమెని నిద్రాదేవి తన వడిలోకి చేర్చుకుంది.

మళ్లీ కల!........

ఈసారి కమ్మని కల!

ప్రభాకర్‌తో కాశ్మీర్ యాత్ర, సుందరమైన ప్రకృతిమధ్య అందమైన సరస్సులో... తన ప్రభూతో కలిసి బోటు షికారు..... వాడిపోయిన విజయముఖం క్రమక్రమంగా వింత వెలుగు నింపుకుంది.

పెదవులమీద చిరునవ్వు వెలిగింది. తెల్లవారుజాముని సూచిస్తూ ఎక్కడ్నుంచో కోడి 'కొక్కొరో' మనికూసింది. ●

[illegible]